
# నీటి తొట్లు వెలవెల.. పశువులు విలవిల

- పట్టించుకోని అధికారులు
- నిర్వహణ లేక శిథిలమైన తొట్లు
- తీరని మూగజీవాల దాహం



కుర్మిద్దలో చుక్కనీరులేక వెలవెలబోతున్న నీటితొట్టి



గుక్కెడు నీటి కోసం పాట్లు పడుతున్న మూగజీవాలు

యాచారం, మే 14 : వేసవిలో పశువుల దాహం తీర్చడానికి గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో నీటి తొట్లను నిర్మించింది. తొట్ల నిండా నీరు నింపడంతో ఉదయం, సాయంత్రం పశువులు, గొర్రెలు, మేకలు తమ దాహార్తిని తీర్చుకునేవి. ప్రస్తుతం చుక్క నీరు లేక నీటి తొట్లు వెలవెలబోతున్నాయి. కొన్ని గ్రామాల్లో నీటి తొట్ల జాడే లేదు. మరికొన్ని గ్రామాల్లో ఎంతో కాలంగా నిరుపయోగంగా ఉండటంతో వాటికి పగుళ్లు వచ్చి, నెర్రెలుబారి శిథిలావస్థకు చేరుకున్నాయి. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు వాటి నిర్వహణ బాధ్యతను గాలికొదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. పైగా ఎండాకాలంలో మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోవడంతో తాగడానికి నీళ్లు లేక గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నాయి. రైతులు, జీవాల పెంపకందారులు బిందెల ద్వారా ఇంటి నుంచి నీరు తీసుకెళ్లి వాటి దాహార్తిని తీరుస్తూ నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

### వృథాగా మారిన నీటి తొట్లు

మండలంలోని మేడిపల్లి, నందివనపర్తి, గున్‌గల్, నానక్‌నగర్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, పిల్లిపల్లి, మంగలిగడ్డతండా, ధర్మన్నగూడ, భాషమోనిగూడ, చౌదర్‌పల్లి, కొమ్మోనిబావి, గొల్లగూడ, తమ్మలోనిగూడ, చింతపట్ల, తులేఖుర్దు, కుర్మిద్ద, తాటిపర్తి, మంథన్ గౌరెల్లి తదితర మేజర్ గ్రామపంచాయతీల్లో నీటి తొట్ల వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో తాగునీరు లేక మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన నీటి తొట్లు వృథాగా మారాయి. మేడిపల్లిలో పలు నీటి తొట్లు ఇప్పటికే నేలమట్టమయ్యాయి. కుర్మిద్దలో వాటర్ ట్యాంకు వద్ద ఉన్న నీటి తొట్టిని పూర్తిగా పూడ్చివేశారు. తాటిపర్తిలో రాళ్లతో నింపారు. పలు గ్రామాల్లో గోడలు కూలిపోయి అధ్వానంగా మారాయి. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ఇలా ఎన్నో నీటి తొట్లు నీరులేక నిరుపయోగంగా మారాయి. జీవాల పెంపకం అధికంగా ఉన్న గ్రామాల్లో నీటి తొట్లను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. శిథిలావస్థలో ఉన్నవాటికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని జీవాల పెంపకందారులు కోరుతున్నారు. అవసరమైన గ్రామాల్లో నూతనంగా నీటి తొట్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### నీటి తొట్లను ఉపయోగంలోకి తీసుకురావాలి



నీటి తొట్లలో నీరు లేక పోవడంతో పశువులకు సకాలంలో తగిన నీరు అందించడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, గొర్లు, మేకలు మేత మేసిన తరువాత వాటికి తాగడానికి నీరు లేక గోసపడుతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలి. నిత్యం పశువుల తొట్లలో తగినంత నీరు నింపి జీవాల దాహార్తి తీర్చాలి. పలు చోట్ల ఎండాకాలంలో చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పశువులకు నీరు దొరకడంలేదు. రైతులు ఇంటికొచ్చాక జీవాలు, పశువులకు నీరు తాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. పంచాయతీ కార్యదర్శులు నీటి తొట్ల నిర్వహణపై నిర్లక్ష్యం వీడాలి. నీటి తొట్లలో నీరు నింపితే జీవాల పెంపకందారులు, రైతులకెంతో మేలు జరుగుతుంది.

**- రవీందర్‌రెడ్డి, నక్కర్తికిసింగారం, యాచారం**

### పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలి



మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న నీటి తొట్లను నీటితో నింపేందుకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు సహకరించాలి. నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను ఉపయోగంలోకి తీసుకురావాలి. అవసరమైతే పంచాయతీ ట్రాక్టర్లతో పశువుల తొట్లు నింపేందుకు కృషి చేయాలి. పంచాయతీ కార్యదర్శులకు ప్రజాప్రతినిధులు సైతం సహకరించాలి. సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

**- నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో, యాచారం**



## 'పట్నం' మెజార్టీపై ప్రధాన పార్టీల ధీమా

పోలింగ్ సరళిపై విశ్లేషణ

ఇబ్రహీంపట్నం, మే 14 : పార్లమెంట్ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మెజార్టీపై ప్రధాన పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. నియోజకవర్గంలోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల్లో జరిగిన ఎన్నికలపై బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఎన్నికల ఫలితాలపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల్లో పైచేయి తమదంటే తమదని పోటీ పడుతున్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఇబ్రహీంపట్నం, శేరిగూడకు చెందినవాడు కావడంతో అతను నియోజకవర్గ ఓటర్లపై భారీగా అంచనా వేశారు. స్థానికుడు కావడంతో పాటుగా, నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పటిష్టంగా ఉండటంతో తనకు భారీ మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. పైగా బడుగు బలహీన వర్గాల నాయకుడు కావడం, 30 ఏండ్లకు పైగా రాజకీయ అనుభవం ఉండటం, కమ్యూనిటీపరంగా తగినంత మద్దతు ఉండటంతో అతడు మరింత ధీమాగా ఉన్నారు. అదే విధంగా కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం ఆశలు పెట్టుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మల్‌రెడ్డి రంగారెడ్డికి భారీ మెజార్టీ రావడం తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నారు. పైగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో వారు మెజార్టీపై గంపెడాశలు పెట్టుకున్నారు. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ కూడా పట్నం మెజార్టీపై ఓ కన్నేశారు. గతంలో భువనగిరి ఎంపీగా పని చేసిన అనుభవం ఉండటంతోపాటు బలమైన బీసీ నాయకుడుగా ఎదగడం, దేశంలో నరేంద్రమోదీ గాలి వీయడం, అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితుడు కావడంతో బూర నర్సయ్య సైతం పట్నంపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల ఫలితాలపై ధీమా ఎలా ఉన్నా గెలుపెవరిది అనే అంశంపై జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే..

## జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యానికి.. నిండు ప్రాణం బలి

నాలా వ్యర్థాలలో పడి యువకుడు మృతి

ఖైరతాబాద్ పీఎస్ పరిధిలో ఘటన

ఖైరతాబాద్, మే 14: జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యానికి ఓ యువకుడు నిండు ప్రాణాలు కోల్పోయాడు. ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆనంద్ నగర్‌కాలనీ నాసర్ స్కూల్ సమీపంలోని నాలాలో గుర్తు తెలియని ఓ యువకుడు చెత్త, వ్యర్థాలలో కూరుకుపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతి కష్టం మీద వ్యర్థాల నుంచి అతడిని బయటకు తీయగా.. అప్పటికే అతడు మృతి చెందినట్టు గుర్తించారు. వ్యర్థాల కోసం దిగి, అందులో కూరుకుపోయి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి చేతిపై రాజు, సునీత, రాధా, సిరివెన్నల అని పచ్చబొట్టు ఉంది. నల్లరంగు జీన్స్, షర్టు ధరించిన ఈ వ్యక్తి వయస్సు సుమారు 35 ఏండ్లు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వారం రోజులుగా వ్యర్థాలు అలానే..

వారం రోజుల కిందట గ్రేటర్‌లో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో ఆనంద్‌నగర్ కాలనీలోని నాసర్ స్కూల్ సమీపంలో ఉన్న ఈ నాలాలో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఆ వ్యర్థాలను తొలగించలేదు. నాలా అడుగు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు వ్యర్థాలు పేరుకుపోయాయి. వ్యర్థాల కిందట ఉన్న నీరు కనిపించకపోవడంతో ప్రమాదవశాత్తు యువకుడు నాలాలో పడి మృతి చెంది ఉంటాడని, జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## 'హరే కృష్ణ'కు ఎలక్ట్రిక్ వాహనం వితరణ

మణికొండ, మే 14: నిరుపేదలకు అండగా నిలిచేందుకు హరే కృష్ణ మూవ్‌మెంట్ ఎల్లప్పుడు నిరంతరాయంగా పని చేస్తున్నదని హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ అన్నారు. పేదలకు ఆహారం పంపిణీ కోసం హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్‌కు రూ.16.5 లక్షల విలువైన ఎలక్ట్రికల్ వాహనాన్ని ప్లంబింగ్, ఎలక్ట్రికల్ సొల్యూషన్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న సావరియా పైప్స్ సంస్థ విరాళంగా అందజేసింది. అయితే, ఈ వాహనాలను మంగళవారం ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సావరియా పైప్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుజిత్ అగర్వాల్ మాట్లాడుతూ, సమాజానికి తిరిగి ఇవ్వడం అనే ఒరవడిని సావరియా పైప్స్ యాజమాన్యం అవలంబిస్తుందన్నారు.




హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు విరాళంగా అందజేసిన ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ ప్రెసిడెంట్

## అతివేగం.. ఇద్దరు దుర్మరణం

వేర్వేరు చోట్ల ట్రావెల్స్ బస్సులు ఢీ

అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

పెద్దఅంబర్‌పేట, మే 14 : విజయవాడ జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సులు ఢీకొని వేర్వేరు చోట్ల ఇద్దరు మృతిచెందిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాముల కళానగర్‌కు చెందిన రేవెళ్ల జంగయ్య (30) ఆటో డ్రైవర్. ఎప్పటిలాగే ఆటో నడిపేందుకు మంగళవారం కూడా ఇంట్లో నుంచి బయలుదేరాడు. బాటసింగారం గ్రామ శివారులో 65వ నంబర్ జాతీయ రహదారిపై మయూరి కాంటా వద్ద ఆటో పాడయింది. ఎంతకీ స్టార్ట్ కాకపోవడంవతో ఆటో దిగి సీవీఆర్ హోటల్ వైపు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్తున్న ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ఢీకొట్టాడు. జంగయ్య తీవ్రంగా గాయపడగా.. స్థానికులు సమీపంలోని దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ జంగయ్య మృతిచెందాడు. జంగయ్య తల్లి యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అర్ధరాత్రి దాటాక.. గుర్తు తెలియని వ్యక్తి

సోమవారం అర్ధరాత్రి తర్వాత మండల పరిధిలోని బాటసింగారం గ్రామ శివారులో జాతీయ రహదారిపై చాచా దాబా దగ్గరలో 30 నుంచి 35 ఏండ్ల వయసున్న ఒక గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. డ్రైవరు అతివేగంగా, అజాగ్రత్తతో నడపడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఓ వాహనదారుడు 100 డయల్‌కు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఏదైనా తెలిస్తే 87126 62650, 87126 62293లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## స్ట్రాంగ్ రూములో ఈవీఎంలు భద్రం

నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ ఉదయం నుంచి మందకొడిగా సాగింది. మధ్యాహ్నం తరువాత ఒక్కసారిగా ఊపందుకుంది. నియోజకవర్గంలోని మంచాల మండలం దాత్‌పల్లిలో అత్యధికంగా 90 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని లక్ష్మారెడ్డిపాలెంలో 41 శాతం నమోదైంది. నియోజకవర్గంలో మొత్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సమస్యాత్మక గ్రామాలపై ఏసీపీ కేవీపీ రాజు సమక్షంలో పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. పోలీసుల భద్రతతో ఈవీఎంలను స్ట్రాంగ్ రూములో భద్రపరిచినట్లు ఏఆర్‌వో అనంతరెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ప్రచారంలో బిజీగా ఉన్న పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు. ఇక ఫలితాల్లో ఎవరు గెలుస్తారోననే అంశంపై చర్చలతో కూడిన ఉత్కంఠ నెలకొంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల వెల్లడి కోసం ప్రతి ఒక్కరూ మరో 20 రోజులు ఎదురు చూడక తప్పదు..

## వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మే 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈ (సీబీసీఎస్) (ఏఐసీటీఈ) అన్ని బ్రాంచిల మొదటి, ఏడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు బీఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా ఐఐసీటీ సైంటిస్ట్ అభిజిత్

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ): రసాయనిక, సాంకేతిక రంగాల్లో ఉన్నత విద్యా, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించే కెమ్‌నానోమ్యాథ్ జర్నల్‌కు ఐఐసీటీ సైంటిస్ట్ అభిజిత్ హజారిక అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఐఐసీటీలో పాలిమర్స్ అండ్ ఫంక్షనల్ మెటీరియల్స్‌లో సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏషియన్ కెమికల్ ఎడిటోరియల్ సొసైటీ ఆయన ఎంపికను ఖరారు చేసింది. కాగా, ఆయన ఎంపికపై ఐఐసీటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

## తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సభ్యులుగా ఐఐసీటీ సైంటిస్టులు

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ): తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన పలువురు పరిశోధకులు సభ్యులుగా ఎన్నికయ్యారు. చీఫ్ సైంటిస్ట్‌గా వ్యవహరిస్తున్న డా.టి.వెంకటేశ్వర్‌రావు, డా.సూర్యప్రకాష్‌సింగ్, డా.ఎస్.రామ్మోహన్, డా.ప్రత్యాయ్‌బాసక్, డా.నివేదితసాహూ, డా.ఎం.మధుమాల, డా.జితేందర్‌రెడ్డి, డా.అందుగులపాటి సాయి ఎఫ్‌టీఏఎస్‌కు సభ్యులుగా వ్యవహంచనున్నారు.

# ఠాణాలకు నీటి కష్టాలు

బోర్లు పనిచేయకపోవడంతో.. ట్యాంకర్లను తెప్పించుకుంటున్న పోలీసులు




*ఓయూ పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న నీటి ట్యాంకర్ (ఫైల్)*

శేరిలింగంపల్లి/ఉస్మానియా యూనివర్సిటీ, మే 14 : నగరంలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు వాటర్ ట్యాంకర్లు వరస కడుతున్నాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో ఇండ్లలో ఉండే బోర్ల నుంచి సరిగ్గా నీళ్లు రాకపోవడంతో హైదరాబాద్‌లో సామాన్య ప్రజలు నీటి కష్టాలు తిరిగి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే క్రమంలో ఇటీవల ఎన్నికల విధుల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులు సైతం సమస్యలు ఎదుర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గ్రంథాలయాలు, కమ్యూనిటీ హాల్‌లలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వాహణకు వచ్చిన సిబ్బందికి నీటి కష్టాలు తప్పలేదు. వీటితో పాటు పోలీస్‌స్టేషన్లలోనూ నీటి కష్టాలు అక్కడక్కడ ఎదురవుతున్నాయి. ట్యాంకర్లతో పోలీస్‌స్టేషన్లకు నీటిని తెప్పిస్తున్నారు. కొన్నిసార్లు బుకింగ్ చేసిన రెండు రోజుల వరకు కూడా ట్యాంకర్ రావడం లేదంటూ కొందరు వాపోతున్నారు. పోలీస్‌స్టేషన్ల ఆవరణలో బోర్లు ఉండటం, కొన్నిచోట్ల కృష్ణ వాటర్ కనెక్షన్లు ఉన్నాయి. వచ్చే మంచి నీరు తక్కువగా రావడం, బోర్ల నుంచి నీరు రాకపోవడంతో కొందరు నీటి ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, గచ్చిబౌలి తదితర ఠాణాలలో నీటి సమస్యలు ఉన్నాయి. గచ్చిబౌలి ఠాణాలో సమస్యపై అక్కడి అధికారులను ఆరా తీయడంతో వేసివి తీవ్రత కారణంగా ఉన్న బోరు పనిచేయడం లేదని, ట్యాంకర్ల ద్వారా నీరు సమకూర్చుకుంటున్నామని తెలిపారు. బోరు పనిచేసేంత వరకు వారానికి రెండు ట్యాంకర్లు అవసరం ఉంటాయని వివరించారు. అలాగే, మూడు రోజుల కిందట బోరు పనిచేయకపోవడంతో వాటర్ సమస్య వచ్చిందని, ట్యాంకర్ తెప్పించుకోవడంతో నీటి సమస్య తీరిందని ఉస్మానియా పోలీసులు వెల్లడించారు.



**జల విహారం..**

నగరవాసులు ఆటవిడుపుగా జలవిహార్‌లో జలకాలాడారు. అలాగే పిల్లలు సైతం వేసవి సెలవులు కావడంతో ఈత కొలనులో ఈదుతూ కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు.

## ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి

ఊపిరి పీల్చుకున్న పోలీసులు..

పోలింగ్ 'డే' ఢీ అంటే ఢీ..

ఆయా ఠాణాల్లో కేసులు.. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత

సిటీబ్యూరో, మే 14 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతపై పోలీసులు దృష్టి పెట్టారు. మరో వైపు పోలింగ్ 'డే' రోజు ఓల్డ్‌సిటీలో కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనగా.. ఆయా ఘటనలకు సంబంధించి అక్కడక్కడ కేసులు నమోదయ్యాయి. మంగళ్‌హాట్ ఠాణా వద్ద బీజేపీ కార్యకర్తలు డమ్మీ ఈవీఎంతో రాకేశ్ గౌడ్, బంటీ ప్రచారం చేస్తుండటంతో వాళ్లపై పోలీసులు కేసు నమోదు చేసి ఠాణాకు తరలించారు. అయితే ఠాణాలో ఉన్న వారిని విడిపించేందుకు బీజేపీ అభ్యర్థి మాధవీలత వెళ్లింది. అక్కడ పోలీసుల విధులకు ఆటంకం కల్గించి తమ అనుచరులిద్దరిని తీసుకొని, పోలీసులు స్వాధీనం చేసుకున్న డమ్మీ ఈవీఎంను కూడా తీసికెళ్లిందని మరో కేసు నమోదు చేశారు. అలాగే సంతోష్ నగర్‌లో దొంగ ఓటు వేసేందుకు వచ్చిన యువతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థులు వారి వారి కార్యకర్తలు, నాయకులతో కలిసి పర్యటించారు. రెండు పార్టీలకు సంబంధించిన నాయకులు ఒక దగ్గర తారస పడ్డప్పుడు ఉద్రిక్తతలు నెలకొనడంతో పోలీసులు ఎప్పటికప్పుడు పరిస్థితిని చక్కదిద్దుతూ వచ్చారు. ఓటు వేయడానికి వచ్చిన ముస్లిం మహిళల బుర్కా(హిజాబు)ను తీసి మాధవీలత నిబంధనలు ఉల్లంఘించారని కేసు, మధురానగర్ ఠాణాలోనూ బీజేపీ సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌పై కేసు నమోదైంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తుండటంతో ఓల్డ్‌సిటీలో మరో ఠాణాలో ఎంఐఎం నాయకులపై కూడా కేసు నమోదు చేశారు. ఇలా ఓల్డ్ సిటీలో ఒకరిపై ఒకరి ఆరోపణలు, ఎన్నికల అధికారుల ఫిర్యాదులతో ఆయా ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి.

### స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత..

నగర పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన 13 లొకేషన్లలో 16 స్ట్రాంగ్ రూమ్‌లున్నాయి. వీటన్నింటికి కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. జూన్ 4 వరకు ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లో ఉండనున్నాయి. ఇక్కడున్న భద్రతను పోలీస్ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎన్నికల అధికారులు, పరిశీలకులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటారు. మూడంచెల భద్రతతో పాటు సీసీ కెమెరాలతో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిఘాను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.